క్లుప్తంగా

ప్రజలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజ అభివృద్ధి

గజ్వేల్‌రూరల్: ప్రజలు ఆరోగ్యవంతులుగా ఉన్నప్పుడే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు కౌన్సిలర్ బొగ్గుల చందు అన్నారు. పట్టణంలో కోట మైసమ్మ గుడి దగ్గర ఆదివారం ఏర్పాటు చేసిన హోమియోపతి వైద్య శిబిరంలో ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రజలు ఆరోగ్యంపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఈ సందర్భంగా వైద్యులు పలువురికి మందులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, ఎల్లయ్య, తిరుపతి, నీరుడి స్వామి తదితరులు పాల్గొన్నారు.

మహేందర్ కుటుంబానికి అండగా ఉంటాం



మహేందర్‌ను పరామర్శిస్తున్న రాంరెడ్డి

తొగుట(దుబ్బాక): ఇటీవల విద్యుత్ షాక్‌కు గురైన బండారుపల్లి మహేందర్ కుటుంబానికి అండగా ఉంటామని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి తెలిపారు. ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని ఆదివారం ఆయన పరామర్శించారు. బాధిత కుటుంబ ఆర్థిక పరిస్థితిని మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింలు, ధనుంజయ ఉన్నారు.

ఇంటింటికీ బీజేపీ కరపత్రం ఆవిష్కరణ

జగదేవ్‌పూర్(గజ్వేల్): కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను గ్రామాల ప్రజలకు తెలియజేయడానికే పల్లె పల్లెకూ బీజేపీ.. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని బీజేపీ జిల్లా నాయకుడు రాములు అన్నారు. ఆదివారం మండలంలోని కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం బీసీల కోసం చేపట్టిన అభివృద్ధి పనులు, పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా నాయకులు కృష్ణమూర్తి, సాయిబాబా, శ్రీధర్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరం




చెక్కు అందజేస్తున్న కుమార్

కొండపాక(గజ్వేల్): నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరమని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్ అన్నారు. మండల పరిధిలోని దుద్దెడకు చెందిన జక్కుల రాకేశ్‌కు మంజూరైన రూ.60వేల చెక్కును సర్పంచ్ ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్‌తో కలిసి ఆదివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుండెల్లి ఆంజనేయులు, నాయకులు దోమల ఎల్లం, నాగరాజు, భాను, మిద్దె భాను, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన అబ్బుల లిఖిత కుటుంబాన్ని డీసీసీబీ డైరెక్టర్ బక్కి వెంకటయ్య ఆదివారం పరామర్శించి, రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రభాకర్, ఎంపీటీసీ ఉమారాణి, నాయకులు అబ్బుల బాలాగౌడ్, ఐతం శ్రీనివాస్, నంద్యాల కిషన్, దోమ కొండ నరేశ్ ఉన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న సంజీవ్‌కుమార్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎలాంటి అనుమతులు లేకుండా పాఠశాల ప్రవేశాలపై ప్రచారం చేస్తున్న పాఠశాల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సంజీవ్‌కుమార్ అన్నారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ.. టెక్నో, ఐఐటీ, స్పేస్ తదితర వాటిని తమ పేర్ల చివరన తగిలించుకొని విద్యార్థుల తల్లిదండ్రులను అయోమయానికి గురి చేస్తున్నాయన్నారు. జిల్లా విద్యాధికారి, మండల విద్యాధికారుల అనుమతులు లేకుండా ప్రచారం నిర్వహిస్తున్న విద్యాసంస్థల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలన్నారు.

సిద్దిపేట బ్రాండ్ అంబాసిడర్లు మీరే

- అందరివారుగా ఆటోవాళ్లు
- జిల్లా ఆటో క్రెడిట్ కో–ఆపరేటివ్ సొసైటీ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి హరీశ్‌రావు



సమావేశానికి హాజరైన ఆటోడ్రైవర్లు, కుటుంబ సభ్యులు



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటకమాన్: ఆటో వారంటే అందరి వారని.. మీరే మన సిద్దిపేట బ్రాండ్ అబాసిండర్లని, పుట్టుక నుంచి చావు దాక అందరి అవసరాలకు అందే ఆటో కీలకమని చెప్పుకోస్తూ నా బలం, బలగం మీరేనని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని వడ్డెపల్లి దయానంద్ ఫంక్షన్‌హాల్‌లో జిల్లా ఆటో క్రెడిట్ కో–ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో సొసైటీ అధ్యక్షుడు పాల సాయిరాం అధ్యక్షతన కుటుంబ సమేతంగా జరిగిన ఆటో కార్మికుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, రోడ్డు ప్రమాదాల్లో గాయాలైన వారిని అంబులెన్స్ కంటే ముందే చేరుకొని ఆదుకునే వారు ఆటోవాలాలన్నారు. నాలుగో సంవత్సర వార్షికోత్సవంలోకి సొసైటీ చేరడం అభినందనీయమన్నారు. సొసైటీ ద్వారా మీ అప్పు రూ.10వేల నుంచి రూ.15వేలు నేటి నుంచి అమలు అవుతుందని స్పష్టం చేశారు. ఆటో లక్ష్మి పేరుతో సొసైటీలోని సభ్యుల కుటుంబంలో జరిగే వివాహానికి రూ.3వేల నుంచి రూ.5116 లకు పెంచుతున్నట్లు పేర్కొన్నారు. ఆటోడ్రైవర్ల ఆహారపు అలవాట్లు మారేలా హాట్ టిఫిన్ బాక్సు, థర్మోస్టాట్ వాటర్ బాటిళ్లను త్వరలో అందిస్తామన్నారు. సొసైటీకి సొంతంగా పెట్రోల్ బంక్ బలోపేతానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సొసైటీ ఏర్పడ్డ తర్వాత అప్పులు పొంది తిరిగి 90 శాతం చెల్లించి ఆర్థికంగా బలోపేతం అయ్యారని, ఇంకా అవసరం ఉంటేనే అప్పులు తీసుకోవాలని కోరారు. ఆటోడ్రైవర్లకు కూడా సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చామని, మరికొంత మందికి త్వరలోనే శిక్షణ అందిస్తామని తెలిపారు. త్వరలోనే ఆటోవాలాలకు హెల్త్ ప్రొఫైల్ చేస్తామని, మీరంతా సంతోషంగా ఉండాలని, మీ పిల్లల ఉన్నత చదువులకు ఆర్థిక ఇబ్బందులు ఉంటే తనను సంప్రదించాలని తాను అండగా ఉంటానని భరోసానిచ్చారు. ఆటోవాలా పిల్లలు పదో తరగతిలో 10/10 జీపీఏ సాధిస్తే రూ.25వేలు నగదు పారితోషకం అందిస్తానని హామీనిచ్చారు. అంతకుముందు సీపీ శ్వేత మాట్లాడుతూ.. మీరంతా సంఘటితం కావడం సంతోషమని, పూర్తిస్థాయిలో రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. అంతకుముందు మంత్రి హరీశ్‌రావు స్వయంగా ఆటో నడుపుతూ కార్యక్రమానికి హాజరయ్యారు. రిమ్ జిమ్ రిమ్ జిమ్ సిద్దిపేట.. ఆటోవాలా జిందాబాద్.. హరీశ్‌రావు జిందాబాద్ అంటూ ఆటోడ్రైవర్ల నినాదాలతో మార్మోగింది. ఆటోడ్రైవర్ల సతీమణిలకు మంత్రి చీరలను అందజేశారు. కార్యక్రమంలో సీపీ శ్వేత, సొసైటీ అధ్యక్షుడు పాల సాయిరాం, ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్, చిట్టి దేవేందర్‌రెడ్డి, రాధాకృష్ణశర్మ, ఎమ్‌వీఐ జనార్దన్‌రెడ్డి, ఆటోడ్రైవర్లు, వారి కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): ప్రతీ కార్యకర్తకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని సలాక్‌పూర్ గ్రామానికి చెందిన గూడా కిషన్ ఇటీవల ప్రమాదశాత్తు మృతి చెందాడు. దీంతో అతని పేరుపై ఉన్న సభ్యత్వ బీమా రూ.2లక్షల చెక్కును అతని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కృష్టారెడ్డి, వైస్ ఎంపీపీ సుమలతమల్లేశం, మండలాధ్యక్షుడు సంతోష్‌కుమార్, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చౌటపల్లిని హుస్నాబాద్‌లో విలీనం చేయాలి



నిరాహార దీక్ష చేస్తున్న గ్రామస్తులు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలంలోని చౌటపల్లి గ్రామాన్ని హుస్నాబాద్‌లో విలీనం చేయాలని నిరసిస్తూ గ్రామస్తులు, స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం చౌటపల్లి క్రాస్ వద్ద నిరాహార దీక్షలకు దిగారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గద్దల రమేశ్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. అక్కన్నపేట వద్దు.. హుస్నాబాద్ ముద్దు అంటూ నినాదాలు చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. చౌటపల్లి గ్రామానికి హుస్నాబాద్ మండలం సమీప దూరంలో ఉంటుందన్నారు. రవాణా సౌకర్యం కూడా అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు ముక్కెర సంపత్, జనగామ వేణుగోపాల్ రావు, చుంచు శంకరయ్య, నాగభూషణ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి మండల పూజ



పూజలు చేస్తున్న అర్చకులు

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని మర్పడ్గలో గల విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో ఆదివారం సుబ్రహ్మణ్యస్వామి మండల పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. క్షేత్రం నిర్వాహకుడు చెప్పెల హరినాథ శర్మ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు గణపతి పూజతో ప్రారంభమై అష్టోత్తర శత 108 కలశాలతో 108 రకాల సుగంధ ద్రవ్యాలు, 108 రకాల మూలికలతో విశేష పంచామృత ఫలరసాలతో కలశ స్థాపన పూజ నిర్వహించారు. తిరుత్తరణి సుబ్రహ్మణ్య ఆలయ అర్చకులు గోపి గురుకుల్, శివకుమార్ గురుకుల్ తదితర పండితులు పూజలు చేశారు. అనంతరం సుబ్రహ్మణ్య మూలమంత్ర త్రిశతి హవనం జరిగింది. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సుబ్రహ్మణ్య స్వామి అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహిస్తామని హరినాథశర్మ పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సుదర్శన్ రెడ్డి, విఠల్, మల్లికార్జున్, రాజేంద్ర ప్రసాద్, నర్సింహ్మారెడ్డి, అనిల్‌కుమార్, మర్యాల రవీందర్, తిరుపతిరెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

వజ్రోత్సవాలను ఘనంగా జరుపుకుందాం

హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



బలగం సినిమా నటులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్: హుస్నాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించే వజ్రోత్సవ సప్తహ కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకుందామని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. ఆదివారం పాఠశాలలో జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. వజ్రోత్సవాలకు పూర్వ విద్యార్థులు కూడా సహాయ, సహకారాలు అందించడం శుభపరిణామమన్నారు. అంతకుముందు పాఠశాల ఆవరణలో వజ్రోత్సవాల సందర్భంగా రూపొందించిన బెలూన్‌ను వజ్రోత్సవాల కమిటీ కన్వీనర్ కొండా లక్ష్మణ్ ఆవిష్కరించారు.

బలగం సినిమా నటులకు సన్మానం

బలగంలో నటించిన నటులను ఎమ్మెల్యే సతీశ్ కుమార్ సన్మానించారు. ఇదే పాఠశాలలో చదివిన రవితేజ బలగం సినిమాలో నటించడమే కాకుండా సినిమాకు ప్రొడక్షన్ కంట్రోలర్‌గా పని చేశాడు. అదే విధంగా సినిమాలో కొమురయ్య పాత్ర వేసిన కేతిరి సుధాకర్‌రెడ్డి స్థానిక సరస్వతి శిశు మందిర్‌లో చాలా సంవత్సరాలు హెచ్‌ఎంగా పనిచేశారు. వీరిద్దరిని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ సన్మానించారు. బలగం సినిమాలో ఈ ప్రాంతం వారు నటించడం గొప్ప విశేషమన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, హెచ్‌ఎం బండారి మనీల, పూర్వ విద్యార్థులు కేడం లింగమూర్తి, ఒంటెల రత్నాకర్, కొత్తపల్లి ఆశోక్, హుస్సేన్, ఆకుల వెంకట్, చింతకింది శ్రీనివాస్, వీరన్న యాదవ్, రాజగోపాల్‌రావు, శ్రీధర్, తదితరులు ఉన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి అంబేద్కర్ కృషి

అక్కన్నపేట(హుస్నాబాద్): అంబేద్కర్ అందరివాడని ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. అంతక్కపేట గ్రామ శివారు కట్కూర్ క్రాసింగ్ వద్ద ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆదివారం జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేనివిధంగా 125 అడుగుల భారీ విగ్రహాన్ని మన రాజధానిలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో నిర్మించుకున్నామన్నారు. గ్రామంలో తాపీమేస్త్రీ కార్మికుల భవన నిర్మాణానికి రూ.10లక్షల నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు.

మేలో గౌరవెల్లిని ప్రారంభిస్తాం

గౌరవెల్లి ప్రాజెక్టును వచ్చే నెలలో ప్రారంభిస్తామన్నారు. దాదాపు కట్ట నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూ నిర్వాసితులకు పరిహారం చెల్లించామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ సందె మహేందర్, ఎంపీపీ లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య మంగ, ఎంపీడీఓ రాము, సర్పంచ్ ఇర్రి లావణ్య, ఎంపీటీసీ కంది రజిత, అంబేద్కర్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామికి ప్రత్యేక పూజలు



దేవసేనకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకుడు

బెజ్జంకి(సిద్దిపేట): విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన ఆదివారం బెజ్జంకి లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆమెకు అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయ కమిటీ సభ్యులు ఆమెకు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ఫ్యాక్స్ వైస్ చైర్మన్ రమేశ్, అర్చకులు మధుసూదనాచారి, శ్రీవాత్సవ్, నాయకులు, ఉపాధ్యాయులు నర్సింహారెడ్డి, రవి, రజనీశ్, సిబ్బంది సునిత, ప్రవీణ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిద్దిపేటరూరల్: రూరల్ మండల పరిధిలోని 33కేవీ, 11కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ డీఈ మహేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని ఇర్కోడ్, బూర్గుపల్లి, తోర్నాల, వెంకటాపూర్, బుస్సాపూర్, చిన్నగుండవెల్లి, రావురూకుల, రాంపూర్ గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. ఈ విషయాన్ని గమనించి వినియోగదారులు సహకరించాలని సూచించారు.

ఎంపీటీసీల ఫోరం జిల్లా కన్వీనర్‌గా అరిగె అశోక్



అశోక్‌కు నియామకపత్రం అందజేస్తున్న రవీందర్

గజ్వేల్: ఎంపీటీసీల ఫోరం సిద్దిపేట జిల్లా కన్వీనర్‌గా గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామానికి చెందిన ఎంపీటీసీ అరిగే అశోక్‌కుమార్‌ను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడీల కుమార్‌గౌడ్ నియమించారు. ఈమేరకు ఆదివారం అశోక్‌కు ఎంపీటీసీల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవీందర్ నియామకపత్రాన్ని అందజేశారు. అశోక్ మాట్లాడుతూ.. ఎంపీటీసీల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తానని పేర్కొన్నారు. తనను నియమించిన కుమార్‌గౌడ్, సహకరించిన దేవీ రవీందర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

బీటీరోడ్లతో పట్టణానికి కొత్త కళ



మాట్లాడుతున్న ఎల్లారెడ్డి

దుబ్బాకటౌన్: పట్టణంలో బీటీరోడ్ల నిర్మాణానికి రూ.4.5కోట్లు మంజూరు చేయడం సంతోషకరమని బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండెల్లి ఎల్లారెడ్డి అన్నారు. ఆదివారం గాంధీ విగ్రహం వద్ద నిర్మిస్తున్న బీటీరోడ్డు పనులను పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. బీటీరోడ్ల నిర్మాణంతో పట్టణానికి కొత్త కళ సంతరించుకుందన్నారు. నిధులు మంజూరు చేయడంపై మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్, ఎంపీ ప్రభాకర్‌రెడ్డిలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అనిల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పంట నిల్వలకు భద్రత

గోదాములతో తొలగిన ఇబ్బందులు



విఠలాపూర్‌లో నిర్మించిన గోదాము

చిన్నకోడూరు(సిద్దిపేట): రైతులు పండించిన పంట ఉత్పత్తులు నిల్వ ఉంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం గోదాముల నిర్మాణాలు చేపట్టింది. స్టేట్‌వేర్ హౌసింగ్ కార్పొరేషన్ కింద నిధులు మంజూరు కాగా గోదాములు నిర్మించారు. దీంతో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని, ఇతర పంట ఉత్పత్తుల నిల్వ చేసుకోవచ్చు. అదేవిధంగా ధాన్యాన్ని విక్రయించే సమయంలో వాతావరణ పరిస్థితులతో రైతులకు తీవ్రంగా నష్టం జరుగుతుంది. రైతులు పండించిన పంట ఉత్పత్తులకు ప్రభుత్వం భద్రత కల్పిస్తుంది. చిన్నకోడూరు మండలం విఠలాపూర్‌లో రూ.5కోట్లతో 10వేల మెట్రిక్ టన్నుల గోదాము, చర్లఅంకిరెడ్డిపల్లిలో రూ.5కోట్లతో 10వేల మెట్రిక్ టన్నుల గోదాము, జక్కాపూర్‌లో రూ.5కోట్లతో 10వేల మెట్రిక్ టన్నుల గోదాము, గుర్రాలగొందిలో 5వేల మెట్రిక్ టన్నుల గోదాముల నిర్మాణం చేపట్టారు. గోదాముల వద్ద కార్యాలయం గది, వే బ్రిడ్జి, హమాలీ షెడ్, గోదాము చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టారు. గోదాముల నిర్మాణంతో ధాన్యం నిల్వ ఉంచడానికి ఎంతో సౌకర్యవంతంగా మారింది.

వార్షికోత్సవానికి ఆలయం ముస్తాబు



ముస్తాబైన ఆలయం

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని దుద్దెడలో గల వేంకటేశ్వరస్వామి, వేణుగోపాలస్వామిల ఆలయం 36వ వార్షికోత్సవానికి అంగరంగ వైభవంగా ముస్తాబైంది. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

రోజువారీ కార్యక్రమాలు..

10వ తేదీ సోమవారం ఉదయం 8 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన, ధ్వజారోహనము, స్థాపితా దేవతా మూలమంత్ర హవనము, 11వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటలకు స్థాపిత దేవతా మూలమంత్ర హవనము, కుంకుమార్చనలు, 12వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు అలివేలు మంగ పద్మావతి, వేంకటేశ్వర స్వామిల కల్యాణోత్సవం, మధ్యాహ్నం 1:15 నిమిషాలకు పూర్ణాహుతి, తీర్థప్రసాద, అన్నదాన వితరణతో వార్షికోత్సవం ముగుస్తుందని వైదిక నిర్వాహకులు వేలేటి రామకృష్ణశర్మ, త్రిపాటి నారాయణ మూర్తిలు పేర్కొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన నాచగిరి



నాచగిరీశుని దర్శించుకుంటున్న భక్తులు

వర్గల్(గజ్వేల్): రెండో యాదాద్రిగా పేరొందిన నాచగిరి లక్ష్మీనృసింహ క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సెలవురోజు కావడంతో హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలు, ఉమ్మడి మెదక్ జిల్లాల నుంచి భక్తులు క్షేత్రానికి తరలివచ్చారు. హరిద్రానది వాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కొండ గుహలో కొలువైన స్వయంభూ స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. మొక్కులు తీర్చుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ సిబ్బంది భక్తులకు ఇబ్బంది కలగకుండా పర్యవేక్షించారు.

‘బీఆర్‌ఎస్‌పై ఆరోపణలు మానుకోవాలి’



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని నర్సాపల్లి గ్రామానికి చెందిన బద్దిపడగ శ్రీనివాస్‌రెడ్డి వారం రోజుల నుంచి తన కుటుంబ సమస్యలను బీఆర్‌ఎస్ పార్టీపై, ఎంపీపీ బద్దిపడగ కృష్టారెడ్డికి అంటగడుతూ పార్టీపై అసత్య ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు గూడ రవీందర్‌రెడ్డి, బడుగు సాయిలు ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలీసులు వెంటనే శ్రీనివాస్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. తన కుటుంబ సమస్యలను తాను పరిష్కరించుకోవాలే తప్పా పార్టీ నాయకులపై అసత్య ఆరోపణలు చేయడం సరైనది కాదన్నారు. ఇప్పటికైనా తన తీరు మార్చుకోవాలని లేకపోతే గ్రామంలోని మహిళలను ఏకతాటిపైకి తీసుకొచ్చి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థుల కరాటే విన్యాసాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ప్రముఖ విద్యావేత్త సత్యం అన్నారు. ఆదివారం జపాన్ కరాటే అసోసియేషన్, సిద్దిపేట జిల్లా కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో 20మంది విద్యార్థులకు కరాటేలో బెల్ట్ గ్రేడింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ.. కరాటే చిన్నారులకు ఆత్మరక్షణతో పాటుగా ఆత్మస్థైర్యం అందిస్తుందన్నారు. కరాటే శారీరక దృఢత్వానికి, మానసిక వికాసానికి ఎంతోగానో దోహదపడుతుందన్నారు. అనంతరం రాణించిన విద్యార్థులకు బెల్ట్స్, సర్టిఫికెట్‌లు అందించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, కరాటే మాస్టర్ భాగ్యరాజ్ పాల్గొన్నారు.

మూడోసారి బీఆర్‌ఎస్‌దే అధికారం



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు, వేదికపై డాక్టర్ యాదవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు

- బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): మూడోసారి బీఆర్‌ఎస్‌దే అధికారమని, గజ్వేల్ నియోజకవర్గంలో లక్ష మెజారిటీ టార్గెట్‌గా ముందుకుసాగాలని అటవీ అభివద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఆత్మీయ సమ్మేళనాల ఇన్‌చార్జి బోడకంటి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డిలు కార్యకర్తలకు సూచించారు. ఆదివా రం వర్గల్‌లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వేలూరి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి వారు హాజరై ప్రధాని మోదీపై నిప్పులు చెరిగారు. దేశానికి రోల్ మోడల్‌గా సీఎం కేసీఆర్ అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథకంలోకి తీసుకెళ్తుంటే జీర్ణించుకోలేని ప్రధాని మోదీ తన అక్కసు వెళ్లగక్కుతూ విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. కుల, మతాల మధ్య చిచ్చుపెట్టి లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్న బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ప్రతీ కార్యకర్త, నాయకుడు, ప్రజాప్రతినిధులు పార్టీ పటిష్టతకు కంకణబద్ధులై పనిచేయాలని, ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యవంతం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు ఎలక్షన్‌రెడ్డి, భూంరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వేలూరి వెంకట్‌రెడ్డి, ఎంపీపీ లతారమేశ్‌గౌడ్, జెడ్పీటీసీ బాలుయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, రైతు కో–ఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సంతోషవెంకట్, ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, బీఆర్‌ఎస్ మాజీ అధ్యక్షుడు నాగరాజు, నాచగిరి మాజీ చైర్మన్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు. కాగా పరిశ్రమల సెజ్‌లో భూములు కోల్పోయిన పలువురు తమకు ప్లాట్ల కేటాయింపులో అన్యాయం జరిగిందని సమావేశంలో ప్రజాప్రతినిధుల దృష్టికి తెచ్చారు. అర్హులకు న్యాయం జరిగేలా చూస్తామని ఈ సందర్భంగా ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి వారికి హామీ ఇచ్చారు.